క్లుప్తంగా

ఎమ్మెల్సీ కవురుకు కృతజ్ఞతలు తెలిపిన కొంతేరు నాయకులు

యలమంచిలి : నూతనంగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ కొంతేరు గ్రామ కమిటీ సభ్యులు గురువారం ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కవురు శ్రీనివాస్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అభినందించిన శ్రీనివాస్ అంకితభావంతో పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయ వర్మ, పాలకొల్లు జెడ్పీటీసీ నడపన గోవిందరాజులు నాయుడులకు కూడా వారు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులను కలసిన వారిలో నూతన అధ్యక్షురాలు జక్కంశెట్టి భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ నిమ్మకాయల హిమబిందు రామకృష్ణ, లంక చిరంజీవి, నిమ్మకాయల వెంకట్, కొయ్యే నాగేశ్వరరావు ఉన్నారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి

పాలకొల్లు సెంట్రల్: విద్యాభ్యాసంలో విద్యార్థుల స్థాయి మరింత పెరగాలంటే తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని జీవీఎస్‌వీ ఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. గురువారం పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ నెలలో జరిగిన ఫార్మేటివ్ అసెస్మెంట్ మార్కుల జాబితాను అందజేశారు. అనంతరం తల్లిదండ్రుల నుండి సూచనలు, సలహాలు స్వీకరించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కొత్తల వెంకట కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దు

నరసాపురం రూరల్: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి శిక్షార్హులైతే వారి భవిష్యత్తు అంధకారం అవుతుందని, నేరం రుజువైతే జైలు శిక్ష పడుతుందని సీనియర్ సివిల్‌జడ్జి వై శ్రీనివాసరావు అన్నారు. గురువారం నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలన అంశంపై ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు, న్యాయవాదులు జానికెనడీ, యర్రంశెట్టి దేవేంద్రఫణికర్, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షురాలిగా కనకరత్నమాల

పెనుగొండ: భీమలాపురానికి చెందిన కొత్త కనక రత్నమాల వెంకటేశ్వర్లు ప్రపంచ ఆర్య వైశ్య మహిళా విభాగం ఏపీ మహిళా సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం భీమలాపురంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కొవ్వూరు పీఆర్‌ఆర్ కల్యాణ మండపంలో ఈనెల 13వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా గ్లోబల్ ప్రెసిడెంట్ టంగుటు రామకృష్ణ(చెన్నై), మహిళా విభాగం ప్రెసిడెంట్ జ్యోతి ప్రసాద్(బెంగళూరు), రాజమండ్రి ఎంపీ భరత్ రామ్, హోం మంత్రి తానేటి వనిత, డెప్యూటీ స్పీకర్ కొలగట్ల వీరభద్రస్వామి హాజరుకానున్నట్లు చెప్పారు. నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించనున్న కొత్త కనక రత్నమాలను పలువురు అభినందించారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

యలమంచిలి: ఉపాధ్యాయుల హక్కులు, సామాజిక బాధ్యత కోసం ఏర్పడిన యూటీఎఫ్ 50 వసంతాలు పూర్తి చేసుకోవడం హర్షణీయమని యూటీఎఫ్ వ్యవస్థాపక సభ్యులు కామ్రేడ్ వలవల శ్రీరామమూర్తి అన్నారు. యూటీఎఫ్ 50వ దినోత్సవం సందర్భంగా సంఘ సభ్యులు గురువారం మేడపాడు సెంటర్లో సంఘ పతాకాన్ని శ్రీరామమూర్తి చేతుల మీదుగా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి పోరాటం చేస్తున్న ఘనత యూటీఎఫ్‌దని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ పూర్వ ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖలే, సంఘ నాయకులు ఈద దైవ వరప్రసాద్, పోలిశెట్టి క్రాంతికుమార్, పంతం రామ్మూర్తినాయుడు, సరిపల్లి జయప్రభ, దేవ సుధాకర్, బోనం కృష్ణమూర్తి, ఈద సంపత రావు, యాడేపల్లి వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా జగనన్న..

- గ్రామగ్రామాన రైతు భరోసా కేంద్రాలు
- పొలం బడితో సాగులో మెలకువలు
- అధిక దిగుబడులు సాధిస్తున్న రైతులు



నవుడూరు గరువులో పొలం బడి కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, అధికారులు (ఫైల్ ఫొటో)

మొగల్తూరు: అన్నదాతను అన్నివిధాలా ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏటా ఖరీఫ్, రబీ సాగు ప్రారంభ సమయంలో పెట్టుబడి కోసం రైతు భరోసా ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు. అలాగే సాగులో రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మరోవైపు రైతులకు సాగులో మెళకువలు నేర్పి అధిక దిగుబడి సాధించేలా రైతులను ప్రోత్సహించేందుకు పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఎంపిక చేసిన గ్రామంలో పొలం బడి

ప్రతి బుధవారం ఎంపికచేసిన గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మొగల్తూరు మండలంలోని శేరేపాలెం పంచాయతీ నవుడూరుగరువు గ్రామాన్ని ఎంపికచేసుకుని ప్రతి బుధవారం రైతులతో సమావేశమవుతున్నారు వ్యవసాయాధికారులు. నియోజకవర్గంలో ఇప్పటికే చాలా గ్రామాల్లో రైతుల తో సమావేశమై సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

దిగుబడి పెంచేలా..

రైతులకు అందుబాటులో ఉన్న పద్ధతులను ఉపయోగించి సాగులో ఖర్చు తగ్గించుకుని అధిక దిగుబడి సాధించేలా ప్రభుత్వం పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తోంది. మొగల్తూరు మండలంలో 1,198 ఎకరాలు, నరసాపురం మండలంలో సుమారు 11 వేల ఎకరాల్లో సార్వా సాగు చేపట్టారు. పొలం బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలు, రాయితీ వివరాలపై రైతులకు అవగాహన కల్పించడం, ఎరువులు, పురుగు మందులు వాడకాన్ని తగ్గించి మిత్ర పురుగుల సంరక్షణ, సేంద్రీయ సాగుపై సూచనలు అందించేలా కృషి చేస్తున్నారు. అంతేకాక పెట్టుబడి తగ్గించి దిగుబడిని పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్‌బీకేలతో ప్రయోజనం

మొగల్తూరు మండలంలో 18, నరసాపురం మండలంలో 23 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. విత్తనం వేసిన నాటి నుండి పంట చేతికొచ్చే వరకు రైతుకు కావాల్సిన పూర్తి సహాయం అందించేందుకు రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. వారంలో మూడు రోజులు క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి రైతులకు తగు సలహాలు, సూచనలు అందించడం పట్ల రైతులు సంతోషంగా ఉన్నారు.

పొలం బడితో ఉపయోగం



రైతు భరోసా కేంద్రాలతో పాటు పొలం బడి కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షదాయకం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అధికారులు రైతులకు అందుబాటులో ఉండేలా నిర్ణయం తీసుకోవడం ద్వారా రైతులకు సమయం ఆదా అవుతుంది. – కైలా సుబ్బారావు, రైతు

నాణ్యమైన విత్తనాలు పొందొచ్చు



రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. రైతులకు అందుబాటులో నాణ్యమైన విత్తనాలతో పాటు రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు అధికారులతో పాటు సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. దీని వల్ల సాగులో మెళకువలు నేర్చుకుని అధిక దిగుబడులు సాధించొచ్చు. – గూడూరి మావుళ్ళు, రైతు

సేంద్రియ సాగుపై అవగాహన కల్పిస్తున్నాం



ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అంతేకాక ప్రభుత్వం అందించే రాయితీలు, పథకాలను పొందేందుకు ఈ క్రాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పెట్టుబడిని తగ్గించి దిగుబడి పెంచేలా కృషి చేస్తున్నాం.

– అబ్దుల్ రహీమ్, మండల వ్యవసాయాధికారి

సర్పంచ్‌కి 2, వార్డు సభ్యులకు 10 నామినేషన్లు



ఆగర్తిపాలెం సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేస్తున్న కావలి లక్ష్మీకుమారి

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఆగర్తిపాలెం సర్పంచ్ పదవికి రెండు నామినేషన్‌లు దాఖలయ్యాయి. కావలి నరసింహారావు సర్పంచ్‌గా పనిచేస్తూ గుండెపోటుతో మృతి చెందడంతో ఉప ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పదవికి నరసింహారావు భార్య లక్ష్మీకుమారి నామినేషన్ దాఖలు చేశారు. గోరింటాడ 6వ వార్డుకు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. చింతపర్రు 6వ వార్డుకు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. వెలివెల 10వ వార్డుకు ఒకటి, దిగమర్రు 7వ వార్డుకు ఒకటి, దగ్గులూరు 12వ వార్డుకు రెండు నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీవో తెలిపారు. సర్పంచ్ అభ్యర్థి లక్ష్మీకుమారి వెంట వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు, వైసీపీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, ఆగర్రు సొసైటీ మాజీ అధ్యక్షుడు మేడిది జాన్ డేవిడ్‌రాజు, శ్రీ కనక దుర్గమ్మ దేవస్థానం చైర్మన్ కావలి శ్రీనివాసరావు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రెండు వార్డులకు ఆరు నామినేషన్లు దాఖలు

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు గ్రామంలో 14వ వార్డుకు, వెలగలేరు 7వ వార్డుకు, ఈనెల 19న జరగనున్న ఉప ఎన్నికలకు సంబంధించి గురువారం నామినేషన్ల ప్రక్రిక ముగిసే సమయానికి 6 నామినేషన్లు దాఖలయ్యాయని ఆయా గ్రామ ఎన్నికల అధికారులు నాగేశ్వరరావు, ఎస్.నాగిరెడ్డి తెలిపారు. ఈనెల 8న నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా, ఆఖరి రోజు మాత్రమే రెండు వార్డులకు నామినేషన్లు దాఖలు అయ్యాయి. మార్టేరు 14వ వార్డుకు చంద్రిక, సుగంధిక, కారెం వరలక్ష్మి, కప్పల అనంతలక్ష్మి, వెలగలేరు 7వ వార్డుకు గుడిమెట్ల చైతన్య పెర్రెడ్డి, గుడిమెట్ల వెంకట రెడ్డి నామినేషన్ల దాఖలు చేశారు.

ప్రజలతో మమేకమై సేవలందించాలి

ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ప్రజలతో మమేకమై సేవలు అందించినప్పుడే సచివాలయ వ్యవస్థ లక్ష్యం నెరవేరుతుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. రుస్తుంబాద గ్రామ సచివాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలను అందించి మంచిపేరు తీసుకువచ్చినప్పుడే సచివాలయాల లక్ష్యం నెరవేరి గ్రామ స్వరాజ్యానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలగకుండా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. సచివాలయానికి వచ్చిన ప్రజలను చిరునవ్వుతో స్వాగతించి సమస్యకు పరిష్కారాన్ని సూచించాలన్నారు. సచివాలయంలోని రికార్డులు హాజరు పట్టీలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. శాఖలవారీగా సచివాలయ ఉద్యోగులను వర్క్‌ప్లాన్ అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 3 గంటల నుండి 5 గంటల వరకు జరిగే స్పందన కార్యక్రమంపై ఆరా తీశారు. స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా సచివాలయ సిబ్బంది చురుకుగా వ్యవహరించాలన్నారు. సచివాలయం బయట ప్రదర్శించిన లబ్ధిదారుల జాబితాను ఆయన పరిశీలించారు. అర్హత ఉండి ఇంకా సంక్షేమ పథకాలు పొందని వారిని గుర్తించి వారిని కూడా లబ్ధిదారుల జాబితాలోకి తీసుకురావాలన్నారు. అర్హత ఉండి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందలేకపోయామని ఫిర్యాదు ఏ ఒక్కరి నుండి రాకుండా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బంది, వలంటీర్లదేనని ఆయన స్పష్టం చేశారు. సచివాయ ఉద్యోగులు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని ప్రసాదరాజు అన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఎంపీడీవో ఎన్వీ శివప్రసాద యాదవ్, మైలాబత్తుల శ్రీను తదితరులు ఉన్నారు.

పొలం బడిని సద్వినియోగం చేసుకోవాలి

పెనుగొండ: రైతుల సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న పొలం బడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. గురువారం కొడమంచిలిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం బడి నిర్వహించి పలు సూచనలు చేశారు. వ్యవసాయ విస్తరణాధికారి బి.నాగరాజు మాట్లాడుతూ రైతులు నూతన సాంకేతికతను అవలంబిస్తూ, వ్యవసాయ నిపుణులు సలహాలు పాటిస్తే తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, సొసైటీ చైర్ పర్సన్ కాండ్రేకుల వెంకట సత్యనారాయణ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

నా భూమి – నా దేశం ప్రతిజ్ఞ

కొడమంచిలిలో గురువారం నా భూమి – నాదేశం, నేల తల్లికి నమస్కారం – అమర వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ నిర్వహించారు. దేశ నాయకుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సతీష్ కుమార్, ఏఈఈ కె.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలవాలి



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న వడలి సొసైటీ నూతన పాలకవర్గం

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకు అండగా నిలవాలని మాజీ మంత్రి,, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. వడలి వ్యవసాయ సహకార పరపతి సంఘ చైర్‌పర్సన్‌గా రంభ సూర్యనారాయణ, పర్సన్స్‌గా కండెల్లి బలరాముడు, శీలంశెట్టి ఆనందరావు పదవీ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులతో పాటు పంట రుణాలు అందించి ఆదుకోవాలన్నారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని పెద్దిరాజు, ,రామన్నపాలెం సర్పంచ్ యర్రంశెట్టి బుజ్జి, వెంకట్రామపరం సర్పంచ్ పిల్లి అనంతలక్ష్మి నాగన్న, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి గణేశ్వరరావు, చిటికెన దుర్గా భవానీ బాబీ, బీసీసెల్ మండల అధ్యక్షుడు కాసాని శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు బండారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండపం అభివృద్ధికి ప్రతిపాదనలు

వడలి ఎస్సీ కాలనీలోని భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మండప అభివృద్ధికి ప్రతిపాదనలు చేసి, పనులు చేపట్టాలని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాలు జారీ చేశారు. గురువారం తూర్పుపాలెంలో ఆయనను వడలి ఎస్సీ కాలనీ యువత కలసి సమస్యలు విన్నవించుకున్నారు. సత్వరం సమస్యలను పరిష్కరించడంతో పాటు మండప అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు భరోసా ఇచ్చారు.

అమరులను స్మరించుకుందాం



యలమంచిలి మండలం మేడపాడులో నా భూమి-నా దేశం అక్షర క్రమంలో వెలిగించిన దీపాలు

యలమంచిలి: ఆజాద్ కి అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా వరుసగా రెండవ రోజు గురువారం మేడపాడు రైతు భరోసా కేంద్రం వద్ద దీపాల వేడుక నిర్వహించారు. నా భూమి-నా దేశం అక్షరాలను రాసి వాటి ఆకారంలో మట్టి ప్రమిదలు ఉంచి వత్తులు వెలిగించారు. అనంతరం దీపాలు చేతితో పట్టుకుని ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులుబాసిన స్వాతంత్ర్య సమరయోధులకు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా శాంతకుమారి స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మేడపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు సచివాలయ కన్వీనర్లు కుసుమే సోని, కుక్కల బాలచంద్రన్ గ్రామ కార్యదర్శి ఎం హరికుమార్, డిజిటల్ అసిస్టెంట్ ఉమర్ ఆలీష సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆగర్తిపాలెంలో నా భూమి – నా దేశం

పాలకొల్లు అర్బన్ : దేశ ప్రజలంతా ఐకమత్యంతో జీవించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు అజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి – నా దేశం, నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం కార్యక్రమాలను ఆగర్తిపాలెంలో నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రత్యేక శిలాఫలకాన్ని నిర్మించారు. మొక్కలు నాటారు. ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు, పంచాయతీ కార్యదర్శి కట్టుంగ కాశీ విశ్వనాథం, సచివాలయ కార్యదర్శి కోట బులిరాజు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ 1, 2 యూనిట్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు లయన్స్ క్లబ్ సౌజన్యంతో కంటి పరీక్షలు నిర్వహించారు. గురువారం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాణిక్యాలరావు మాట్లాడుతూ లయన్స్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. దానిలో భాగంగా విద్యార్థులకు అతి ముఖ్యమైన కంటి పరీక్షలు నిర్వహించాలని ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ సంగినీడి రంగారావు, కొమ్ముల మురళీకృష్ణ, లయన్స్ సభ్యులు లక్ష్మీపతిరాజు, అధ్యాపకులు డాక్టర్ సీహెచ్ ఉషారాణి, డాక్టర్ ఎం.రామకృష్ణ, డి.మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనతో రక్తహీనత దూరం

మొగల్తూరు: నులిపురుగుల నిర్మూలనతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రసాదరాజు తెలిపారు. గురువారం మొగల్తూరులోని పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలన ద్వారా రక్తహీనతను నివారించడంతో పాటు పోషకాలను పెంచుతుందన్నారు. మండలంలోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ప్రతి ఒక్కరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.బాబ్జీరాజు, డాక్టర్ జ్యోత్స్నాదేవి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే

నరసాపురం రూరల్: జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్)-6 చురుగ్గా సాగుతోందని డీఎంవో డాక్టర్ జి.సుగుణరాజు అన్నారు. గురువారం మండలంలోని దర్బరేవు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సిగ్మా రీసెర్చ్ అండ్ కన్సల్టింగ్ సంస్థ సిబ్బంది చేస్తున్న సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై డేటాబేస్‌ను పటిష్టం చేయడంలో ఈ సర్వే కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ ద్వారా ఇప్పటి వరకూ ఐదు రౌండ్‌లలో గుర్తించిన ఆరోగ్య సమాచారం, విధానాలను పరిగణలోకి తీసుకుని తాజాగా ఎన్ఎస్‌హెచ్ఎస్-6 సర్వేను ప్రభుత్వ చేపట్టిందన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరిగే ఈ సర్వే ద్వారా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన విలువైన డేటాను సంగ్రహించడం జరుగుతోందన్నారు. ఈ సర్వేలో వయస్సుల వారీగా స్త్రీ, పురుషులు, చిన్నారుల అనారోగ్య సమస్యలు, ప్రభుత్వం ద్వారా పొందుతున్న ఆరోగ్య కార్యక్రమాల వివరాలు, గర్భనిరోధానికి తీసుకుంటున్న విధానాలను తెలుసుకుంటున్న చెప్పారు. సిగ్మా సంస్థకు చెందిన ఒక టీంలీడర్‌తో పాటు నలుగురు సభ్యుల బృందంతో పాటు మరో ఇద్దరు రక్త నమూనాలను సేకరించే సిబ్బంది ఉన్నారన్నారు. మన ప్రాంతంలో ఇప్పటి వరకూ నరసాపురం పట్టణంలోని 18వ వార్డు, యలమంచిలి మండలంలోని కరుగోరుమిల్లి గ్రామం, వేములదీవి వెస్ట్ గ్రామాల్లో సర్వే చేశారన్నారు. యలమంచిలి మండలం వల్లూరు, గణపవరం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, పాలకోడేరు తదితర ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో రెండు టీమ్‌లు ఈ సర్వే నిర్వహిస్తున్నారన్నారు. నోడల్ ఆఫీసర్ హరి, సర్వే టీమ్ లీడర్ రాజేశ్వరి పాల్గొన్నారు.